క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు

బోథ్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పెద్దమ్మ గుడి నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండ మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో బోథ్ మండల కేంద్రానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్, రాజు, పాలిక్ రమేశ్, తదితరులు ఉన్నారు.

సమాజ సేవలో యువత ముందుండాలి



నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: సమాజ సేవలో యువత ముందుండాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ బాలశంకర్ కృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ప్రపంచ రెడ్‌క్రాస్ సొసైటీ, సికిల్‌సెల్ దినోత్సవాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఫౌండర్ జాన్‌హెన్రి డునంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించి, సమాజాన్ని చైతన్యం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ప్రశాంత్, ప్రఫుల్ వర్మే, చరణ్‌గౌడ్, బండారి దేవన్న, సామ రూపేష్‌రెడ్డి, దొంతుల ప్రవీణ్, అర్బాత్ ఖాన్, అబ్దుల్ అజీజ్, సిరాజ్, రవికుమార్, ఇస్మాయిల్, ఖలీల్ పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ కౌన్సిలర్ సంగీత ధమ్మపాల్ నానమ్మ దానపెల్లి ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆదిలాబాద్ పట్టణంలోని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల విడుదలైన టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో పీడీగా ఎంపికైన ఏబీవీపీ పూర్వ విద్యార్థి సీహెచ్ శైలజను తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు సన్మానించారు. బుధవారం ఆమె నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలభోజు గోపికృష్ణ, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోల కిరణ్‌కుమార్, అల్లూరి మనోజ్ రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బత్తుల అశోక్

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకులు బత్తుల అశోక్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్ సీఎం క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు రేవంత్‌రెడ్డి అశోక్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.

నీటి సరఫరా పునరుద్ధరణ



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలోని ఎస్సీ కాలనీకి తాగునీటి సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. ఎస్సీ కాలనీకి సరిపడా తాగునీరు రాకపోవడంతో కాలనీవాసులు, మహిళలు మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. దీంతో ఇన్‌చార్జి డీపీవో ఫణీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. నీటి సరఫరా నిలిచిపోవడానికి గల కారణాలు తెలుసుకొని, మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. డీపీవో వెంట ఎంపీడీవో మోహన్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమణ, ఏఈ ప్రశాంత్, ఎంపీవో స్వప్నశీల, పంచాయతీ కార్యదర్శి విజయ్ ఉన్నారు.

భూసారం గుర్తించు.. దిగుబడి సాధించు



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

- భూసార పరీక్షలు చేయిస్తేనే అధిక దిగుబడి
- అవగాహన లేమితో రైతుల వెనుకంజ

బోథ్: వ్యవసాయ క్షేత్రాలు ఏ రకమైన పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయి.. భూమిలోని పోషకాల స్థాయి.. ఎలాంటి ఎరువులు వేయాలని అనే విషయాలపై రైతులకు అవగాహన కలగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. సరైన సమయంలో వర్షాలు పడకపోవడం, ప్రకృతి అనుకూలించకపోవడంతో రైతులు ప్రతిఏటా నష్టపోతున్నారు. ఈక్రమంలో భూసార పరీక్షలు నిర్వహించి వాతావరణ పరిస్థితులకు తగిన పంటలను సాగుచేస్తే ఆశించిన దిగుబడులు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

జిల్లాలో పరిస్థితి..

ఆదిలాబాద్ జిల్లాలో 101 క్లస్టర్లు ఉన్నాయి. వాటి పరిధిలో దాదాపు 5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. జిల్లాలో సుమారు రెండు లక్షల మంది రైతులు ఉన్నారు. ఏటా వర్షాకాలం, యాసంగిలో పత్తి, సోయా, పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న, శనగ, కంది పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఎరువులు ఎంత మోతాదులో వాడాలి. భూమి ఏ పంటలకు అనుకూలంగా ఉందో తెలియక పోవడంతో దిగుబడి రావడంలేదు. ఫలితంగా అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

అవగాహన లేమితో వెనుకంజ..

అన్నదాతలు పంటల సాగుపై దృష్టి పెడుతున్నారు కానీ భూమిలోని పోషకాల స్థాయి తెలుసుకోవడం లేదు. విరివిగా రసాయన ఎరువుల వాడకంతో సాగు వ్యయం పెరగడంతో పాటు భూమిలో పోషక విలువలు తగ్గుతున్నాయి. నేల స్వభావం తెలియక అవసరానికి మించి క్రిమిసంహారక మందులు వినియోగిస్తున్నారు. భూసార పరీక్షల ప్రాధాన్యంపై రైతు సదస్సులు, సమావేశాల్లో వ్యవసాయాధికారులు, సిబ్బంది పదేపదే చెబుతున్నా.. రైతులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. అలాగే భూసార పరీక్షల ఫలితాలను అధికారులు సమయానికి అందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫలితాల ఆధారంగా..

భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. భూసార పరీక్షల ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లోని ఉదజని, లవణ సూచిక పోషకాలు, నత్రజని, భాస్వరం, పొటాష్‌ల లభ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా అవసరమైన మోతాదులో ఎరువుల వినియోగానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను ఆశ్రయించి వారు సూచించిన వంగడాలను సాగు చేస్తే దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

అధికారులను సంప్రదించాలి



రైతులు తమ భూమికి సంబంధించిన భూసార పరీక్షలను ప్రతి ఏటా చేయించుకోవాలి. భూసార పరీక్షల వల్ల భూమి సారం తెలుస్తుంది. భూమికి కావాల్సిన పోషకాలను ఇవ్వగలిగే అవకాశం ఉంటుంది. ఏప్రిల్, మే నెలలో భూసార పరీక్షలను చేయించుకోవాలి. ఇందుకోసం ఆయా క్లస్టర్లలో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలి.

– వెండి విశ్వామిత్ర, వ్యవసాయాధికారి, బోథ్

అకాల వర్షంతో అన్నదాతల దిగులు



సాగవుతున్న వేరు శనగ (ఫైల్)

- పంటలకు వర్షాల ముప్పు
- కోతకు వచ్చిన జొన్న, వేరుశనగ

ఆదిలాబాద్‌రూరల్: వానాకాలంలో అంతంతమాత్రంగానే పంటల దిగుబడులు సాధించిన రైతులు ప్రతీ ఏడాది యాసంగిలో రెండో పంట కింద వివిధ పంటలు సాగు చేసి కొంత అప్పుల నుంచి బయట పడుదాం అనుకుంటారు. అందులో భాగంగానే ఈఏడాది కూడా యాసంగి సీజన్‌లో మండలంలోని రైతులు వివిధ పంటలను సాగు చేశారు. మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జొన్న, వేరుశనగ, మక్క, తదితర పంటలపై అకాల వర్షాల ముప్పు పొంచి ఉందని వాపోతున్నారు. మండలంలో సాగవుతున్న ప్రధాన పంటైన జొన్న, వేరుశనగ ప్రస్తుతం కోత దశకు వచ్చింది. ఈనేపథ్యంలో వాతావరణం సాయంత్రం వేళలో చల్లబడిపోవటం, మేఘాలు కమ్ముకోవడంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో..

మండలంలో ఈ ఏడాది మార్చిలో కురిసిన వడగళ్ల వానతో జొన్న పంట నేలకు ఒరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో వడగళ్లు, గాలి బీభత్సం వెంటాడుతుండడంతో పంటలు చేతికి రాకుండా పోతుందని రైతన్నలు ఆందోళ చెందుతున్నారు. గత యాసంగి సమయంలో కూడా పంట చేతికి వచ్చే సమయంలో కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ఈఏడాది కూడా అదే పరిస్థితి ఉండడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

యాసంగి సాగు ఇలా..

ఈ ఏడాది యాసంగిలో మండలంలో సుమారు 7,452 ఎకరాలలో పంటలు సాగవుతున్నాయి. జొన్న 7,200 ఎకరాలు, వేరుశనగ 120 ఎకరాలు, మక్క 62 ఎకరాలు, గోధుమలు 40 ఎకరాలు, నువ్వులు 30 ఎకరాలలో సాగవుతున్నట్లు వ్యవసాయాధికారుల రికార్డులు చెబుతున్నాయి. ముందస్తు సాగు చేస్తే చలి వాతావరణంతో పంటల దిగుబడులు తగ్గటం, వాతావరణ పరిస్థితులు, కూలీల కొరత నుంచి గెట్టెక్కినా వెంటాడే ప్రకృతి వైపరీత్యాలతో రైతులు బాధలు వర్ణనాతీతం. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని కొంత మంది రైతులు నవంబర్‌లోనే ముందస్తు సాగు విధానాన్ని ఎంచుకున్నారు. అలాంటి వారిపై వడగళ్ల వాన ప్రభావం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మరో వారం రోజుల పాటు ప్రకృతి కరుణిస్తే రైతులు యాసంగి సాగు నుంచి గట్టెక్కె అవకాశం ఉందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం

బోథ్: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు గంగారెడ్డి, సల్ల రవి, మెరుగు భోజన్న, గంగాధర్, అబూద్, శేఖర్, సురేందర్, రాము, ఏఎంసీ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, రహీమోద్దీన్, ఫెరోజ్ ఖాన్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్: ప్రచారం చేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ.. ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్ పట్టణంలోని 45, 49వ వార్డుల్లో ప్రచారం చేయగా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి పిట్టలవాడలో ప్రచారం చేశారు. కంది సాయి మౌన రెడ్డి శాంతినగర్, కాలేజీ కాలనీ, వెంకట్రావ్ కాలనీ, గందేవార్ తోట, రవీంద్రనగర్, మసూద్‌చౌక్, వినాయక్‌చౌక్, ఓల్డ్ హౌజింగ్‌బోర్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు.

- ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి కోసం ముందుండి పోరాడే సుగుణను పార్లమెంట్‌కు పంపించాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, రహీంఖాన్, దామోదర్ రెడ్డి, నాగరాజు, ప్రభాకర్, తది తరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని టీపీసీసీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డిలు అన్నారు. బుధవారం మండలంలోని భీంసరి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, అశోక్ పాల్గొన్నారు.

తాంసి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని బోథ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కోరారు. బుధవారం భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, అశోక్, దేవారెడ్డి, పవార్ నారాయణ, మల్లేష్, సుభాష్ రెడ్డి పాల్గొన్నారు.

జైనథ్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఐదు న్యాయాలను అమలు చేస్తుందని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సిడాం అవినాష్ అన్నారు. బుధవారం మండలంలోని ఆనంద్‌పూర్, కూర, కరంజి, పిప్పల్‌గావ్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సిడాం ఇస్తారి, సోయం అవినాష్, ఎల్టి వెంకట్ రెడ్డి, అడ్డి వెంకట్ రెడ్డి, పంద్రె చందు, గెడం రాంచందర్, మెస్రం రఘు పాల్గొన్నారు.



తాంసి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడే గజేందర్

బీఆర్‌ఎస్, బీజేపీ పాలనలో అభివృద్ధి శూన్యం

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్, బీజేపీ పాలనలో ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చాందా (టి), జందాపూర్, అర్లి (బి), లాండసాంగ్వి గ్రామాలలో పర్యటించారు. ఆదిలాబాద్ జిల్లా అన్నిరంగాల్లో వెనుకబడి ఉందని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపిస్తే అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ కొండ గంగాధర్ ఉన్నారు.

ఇంద్రవెల్లి: కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను ఎంపీగా గెలిపించాలని నాయకులు కోరారు. బుధవారం మండలంలోని గౌరపూర్, సాలేగూడ, దొబిగూడ, మోహన్‌గూడ గ్రామాల్లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ముఖడే ఉత్తం, ఎండీ మసుద్, మెస్రం నాగ్‌నాథ్, సోమోరే నాగోరావ్ పాల్గొన్నారు.

'బీజేపీతోనే సుస్థిర పాలన'

ఇచ్చోడ: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కదం బాబారావు అన్నారు. బుధవారం మండలంలోని తలమద్రి, మల్యాల్, యాపల్‌గూడ, కోమటిగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుస్థిర పాలన కావాలంటే దేశానికి మోదీ ప్రధానమంత్రి కావాలన్నారు. దేశ భవిష్యత్ మరింత బాగుండాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేంద్రే నారాయణ, దయకుమార్‌రెడ్డి, గట్టు మహేందర్, అంబేకర్ పాండురంగ్, పెరమల్ల పోశెట్టి, తుమ్మల రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

- బీజేపీతోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సిరిసిల్ల భూమయ్య, దుబాక సూభాష్‌లు అన్నారు. బుధవారం ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాల్లో బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చిట్టి రవి, జన్నారపు సాయి, సుంకి అనిల్, కాశిపాక విష్ణు, కల్లేపల్లి రాజు, మచ్చ గంగయ్య, ఆరెపల్లి రవి పాల్గొన్నారు.

నేరడిగొండ: ఆదిలాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ కోరారు. బుధవారం మండలంలోని కొరటికల్(బి), మథుర తండా, కొరటికల్(కె), అర్కగూడ, ధన్నూర్(డి), నంద్యానాయక్ తండా, బండగూడ, చింతగూడ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. దేశ రక్షణ కోసం పరితపించే బీజేపీకి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో తిత్రే నారాయణ్ సింగ్, జ్ఞానసుధ, పరుశురాం, కోటేష్, క్రిష్ణ, భీంరావ్, దుర్వ రాజు, కేవల్ సింగ్, కమల్ సింగ్, పులి సురేశ్, ఉమేష్ పాల్గొన్నారు.



తాంసి: కప్పర్లలో ప్రచారం చేస్తున్న నాయకులు

తాంసి: బీజేపీ నాయకులు బుధవారం మండలంలోని కప్పర్ల గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సదానంద్, పోచ్చన్న, సుభాష్, నంద్ పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖానాపూర్: అయోధ్య రామాలయం, అక్షింతలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని భజరంగ్‌దళ్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్ మాట్లాడారు. హిందువుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన సీఎం హిందువుల మనోబావాలను దెబ్బతీస్తే ఊరుకోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సీఐ సైదారావు అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి

ఇచ్చోడ: హిందూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని హరిభక్త పారాయణ్ అర్జున్ మహరాజ్ అన్నారు. మండలంలోని నర్సాపూర్‌లో బుధవారం జరిగిన రామకృష్ణ హరే ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రసుతం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, రీల్స్‌లకు చాలా ఆదరణ ఉందన్నారు. దీంతో యువతకు హిందూ సంస్కృతి, సంప్రదాయాలు తెలియకుండా పోతుందన్నారు. వారం రోజులు రామకృష్ణ హరే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

ఇంద్రవెల్లి: ఈనెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ నాయకుల ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి ఎస్సై దుబ్బక సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా ప్రత్యేక బలగాలతో మార్చ్‌ఫ్లాగ్ నిర్వహించినట్లు ఉట్నూర్ సీఐ మొగిలి తెలిపారు. బుధవారం పట్టణంలో పాత బస్టాండ్ నుంచి అంగడీ బజార్, ఐబీ చౌరస్తా, ఎన్టీఆర్ చౌక్, ఐటీడీఏ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం మీదుగా పోలీసుస్టేషన్ వరకు ఫ్లాగ్‌మార్చ్ సాగింది. ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ధైర్యంగా ముందుకొచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మనోహర్, ప్రత్యేక బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి



ఇచ్చోడ: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



బోథ్: ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇచ్చోడ/గుడిహత్నూర్: ప్రశ్నించే గొంతుకైన ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కోరారు. బుధవారం ఇచ్చోడ మండలంలోని అడేగామ(బి)లో, గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అసలు రూపం బయటపడుతుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్లలో ఆదిలాబాద్ జిల్లాకు చేసిందేమిలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు కృష్ణారెడ్డి, పాండురంగ్, గణేష్, సాబీర్, వెంకటేశ్, కదం వనిత సూభాష్, ఎంపీపీ కేంద్రే జ్ఞానోబా, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, తిరుమల్‌గౌడ్, రమేశ్ జాదవ్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ఎంపీపీ జైవంత్‌రావు, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ బుధవారం ఆయా కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. రషీద్, రమేశ్, వాసు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బోథ్: బీఆర్‌ఎస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రం ఎన్నికల ప్రచారం చేశారు. ఆత్రం సక్కును ఎంపీగా గెలిపించాలని కోరారు. సురేందర్ యాదవ్, రఫి, సత్యనారాయణ, వినయ్, రమణ గౌడ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ఎంపీపీ రాథోడ్ సజన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. ఏలేటి మహేందర్ రెడ్డి, అల్లూరి శివారెడ్డి, రవీందర్ రెడ్డి, జహీర్, జాదవ్ గణేష్, సుజీల్, నారాయణ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి ఆత్రం సక్కును ఎంపీగా గెలిపించాలని బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గం ఇన్‌చారిజ భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పిప్రి, లక్కుగూడ, దనోరా గ్రామాల్లో ప్రచారం చేశారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, బీఆర్‌ఎస్ నాయకులు మీర్జా జీలానిబేగ్, సుఫీయన్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

బోథ్: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని బోథ్ ఎస్సై రాము అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో బాల్య వివాహాల వలన కలిగి అనర్థాలపై అవగాహన కల్పించారు. పెళ్లి చేసుకోబోయే యువతీ యువకులు ముందుగా తమ వయస్సును నిర్ధారణ చేసుకొని ఒక మంచి ఉన్నత స్థానంలో స్థిరపడిన తరువాతే పెళ్లి చేసుకోవాలన్నారు. 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు, 21 ఏళ్ల లోపు అబ్బాయిలకు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో భూమారెడ్డి, ఎర్రోళ్ల సతీష్, ఈజీఎస్ ఏపీవో జుగాదీ రావు, ఎంపీవో మహేందర్ రెడ్డి, మాధవ్, ప్రేమల, అనిల్ వెంకటేశ్ పాల్గొన్నా రు.



మాట్లాడుతున్న ఎస్సై రాము

వీధికుక్కల స్వైరవిహారం

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రామాలయం కాలనీలో బుధవారం పడిగెల అనూష, బొమ్మడి విజయ అనే మహిళపై కుక్కలు దాడి చేశాయి. విజయ తలపై తీవ్రంగా గాయపరిచాయి. గమనించిన భీమన్న అనే వ్యక్తి కుక్కను తరమే ప్రయత్నం చేయగా.. ఆయన చేతిని కరిచింది. కాలనీకి చెందిన భూమన్న కాలిని గాయపరిచింది. అంతకుముందు రోజు కూడా పలువురిని గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ సిబ్బంది స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



గాయం చూపిస్తున్న భూమన్న